క్లుప్తంగా

సోమాలమ్మను దర్శించుకున్న కలెక్టర్ మాధవీలత దంపతులు



సోమాలమ్మను దర్శించుకున్న కలెక్టర్ మాధవీలత దంపతులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం నగరంలో కొలువై ఉన్న శ్రీ సోమాలమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకుని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నగరంలో గాంధీపురంలో కొలువైవున్న శ్రీ సోమాలమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా పూజా కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పూజారులు అర్చన చేసి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదాన్ని అందజేశారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు శ్రీ సోమాలమ్మ దేవత జాతర మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు.

లేపాక్షిలో డిస్కౌంట్ సేల్స్

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియం ఆధ్వర్యంలో భారీ డిస్కౌంట్ సేల్స్‌తో వస్తువులు విక్రయిస్తున్నామని లేపాక్షి సంస్థ మేనేజర్ ఎ.కార్తీక్ కుమార్ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ సేల్‌లో ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్లు ప్రకటించామన్నారు. ఈ అమ్మకాలు ఈ నెల 31వ వరకు నిర్వహిస్తామన్నారు. అన్నిరకాల కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, బంజారా ఐటమ్స్, చేనేత వస్త్రాలు, కలంకారీ కాటన్ చీరలు, కలంకారీ ఐటమ్స్ మరెన్నో విభిన్న వస్తువులు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరాలతో ప్రజలకు మేలు

కడియం: అత్యాధునిక సదుపాయాలు ఉన్న ఆసుపత్రులు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. ట్రై ఓ డెంట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గిరజాల ప్రారంభించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ అయ్యల భారతి ఆధ్వర్యంలో బృందం సుమారు 200 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, బ్రెష్‌లు, పేస్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయ్యల గోపి, కొత్తూరి బాలనాగేశ్వరరావు, మార్ని తమ్మయ్య, కొత్తూరి వేణు, మార్ని నారాయణరావు, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారుగా రామారావు



సీటీఆర్ఐ: రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశంలో ప్రముఖ కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు యోధుడు నల్లా రామారావును రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులుగా సభ్యుల హర్షధ్వానాల మధ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు డీ.కే.నాగరాజు ప్రకటించారు. నల్లా రామారావుకి దేవాంగ సభ్యులందరూ అభినందనలు తెలియజేశారు.

పీహెచ్‌సీ వద్ద హెల్దీ వుమెన్

ధవళేశ్వరం: ధవళేశ్వరం పీహెచ్‌సీ వద్ద ఆదివారం హెల్దీ వుమెన్ కార్యక్రమం నిర్వహించారు. మోటారు సైకిళ్లకు బదులుగా సైకిల్‌ను వినియోగించడం ద్వారా పలు ఉపయోగాలు ఉన్నాయని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేలా పెట్టుబడుల సమావేశాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/కడియం: విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన పెట్టుబడుల సమావేశాలు ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. రాజమహేంద్రవరం వి-కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖలో రెండురోజుల పాటు జరిగిన జీఐఎస్ సమ్మిట్‌కు సుమారు రూ.170 కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టారని అన్నారు. కడియపులంక గ్రామంలోని నర్సరీలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదులో మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం నుంచి ఏమాత్రం భరోసా అందని నేపథ్యంలో తమ పార్టీ గత రెండు రోజుల్లో రూ.90 లక్షల ఆర్థిక సాయం అందజేసిందని చెప్పారు. కార్యక్రమాల్లో జనసేన తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

జగనన్న హరిత నగరంగా రాజమహేంద్రి

- మహా నగరాలు విశాఖ, విజయవాడలతో పోటీ
- రూ.4.3 కోట్లతో గ్రీన్ చాలెంజ్
- 4.3 కిలోమీటర్ల మేర డివైడర్ల సుందరీకరణ
- 40,000 పూలమొక్కలు
- 1000 సెంటర్ ప్లాంట్లతో ఏర్పాట్లు



నందం గనిరాజు జంక్షన్‌లో సుందరీకరించిన డివైడర్



జాంపేట సెంటర్‌లో డివైడర్

రాజమహేంద్రవరం సిటీ: పచ్చదనం సుందరీకరణలో రాష్ట్రంలో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడలతో పోటీ పడుతూ గ్రీన్ చాలెంజ్‌లో ప్రథమ స్థానం సాధించేందుకు రాజమహేంద్రవరం నగరం పోటీ పడుతోంది. జగనన్న హరిత నగరాల్లో భాగంగా రూ.4.3 కోట్లతో పచ్చదనంతో డివైడర్లు ఆధునీకరించేందుకు నగర పాలక సంస్థ సిద్ధమైంది. రాజమహేంద్రవరం ప్రధాన రహదారుల్లో 4.3 కిలోమీటర్ల మేర డివైడర్లపై పలు రకాల పూలమొక్కలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగు రకాల పూల మొక్కలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 40,000 పూలమొక్కలు, 1,000 సెంటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరాన్ని ఆక్సిజన్ సిటీగా తయారు చేసేందుకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో మొక్కలతో పచ్చదనం నింపే విధంగా హరిత యువత పేరుతో నగరంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు వారు నాటిన మొక్కలను వారికి దత్తత ఇచ్చే విధంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు మొక్కల నాటిన చోట వారి పేర్లతో నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మొక్కలను దత్తత ఇవ్వడం ద్వారా వాటిని స్వంతంగా భావిస్తారనే ఉద్దేశంతో ఈ విధమైన యువత హరిత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ భరత్‌రామ్ ప్రకటించారు. ప్రణాళిక మేరకు 4.3 కిలోమీటర్లలో ఇప్పటి వరకూ 2 కిలోమీటర్లు మేర డివైడర్ల నిర్మాణం, వాటిలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేశారు.

విజయం సాధిస్తే రూ.కోటి బహుమతి

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిటీ చాలెంజ్‌లో రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడలతో రాజమహేంద్రవరం నగరంలో పోటీ పడుతోంది. పచ్చదనం ఏర్పాటులో ప్రథమ స్థానం సాధిస్తే గెలుపొందిన నగరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి బహుమతిగా అందజేయనుంది.

సుందరీకరణ చేపట్టిన రహదారులు

- జాంపేట నుంచి నందం గనిరాజు జంక్షన్
- వీఎల్‌పురం నుంచి తాడితోట
- ఏవీ అప్పారావు రోడ్ రామాలయం జంక్షన్ నుంచి షెల్టన్ హోటల్
- తిలక్ రోడ్
- ఆజాద్ చౌక్ నుంచి చర్చి గేట్ వరకూ

మార్చి నాటికి సుందరీకరణ పూర్తి



నగరంలో గ్రీన్ చాలెంజ్ కార్యక్రమంలో 4.3 కిలోమీటర్లు మేర డివైడర్లను రూ.4.3 కోట్లతో చేపట్టాం. ఇప్పటి వరకూ రెండు కిలోమీటర్లు పూర్తి అయ్యాయి. మిగిలిన 2.3 కిలోమీటర్లు మార్చి నెల చివరి నాటికి పూర్తి చేస్తాం.

– కె.దినేష్‌కుమార్, కమిషనర్ నగర పాలక సంస్థ

సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: సమాజాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని అక్షరశ్రీ విద్యా నికేతన్ 21వ వార్షికోత్సవానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తివంతమైన సందేశం ఇచ్చారు. కలలను నెరవేర్చుకునేందుకు కొంతమందే పట్టుదలగా కృషి చేస్తారని, వారిలో లక్ష్యాన్ని చేరుకున్నవారే ఉన్నత శిఖరాలను అధిరోహించి గుర్తింపు పొందుతారన్నారు. అటువంటి వారిని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అక్షరశ్రీ ప్రైమరీ స్కూలు విద్యార్థులు, ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, డైరెక్టర్ నాగరత్నం, స్కూల్ చైర్మన్ గజేంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై జనార్ధన స్వామి

కడియం: స్థానిక జనార్ధనస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. మేళతాళాలు, బాజాభజంత్రీల మధ్య పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం జగన్నాధాచార్యులు, చక్రపాణిల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సదస్యం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

రథోత్సవంలో గాయపడ్డ వారిని పరామర్శించిన ఎంపీ భరత్



గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామివారి రథోత్సవంలో గాయపడిన యువకులను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం పరామర్శించారు. రథోత్సవంలో గాయపడ్డ కాపవరం గ్రామానికి చెందిన కాపారపు నాగబాబు, కనుపూరు గ్రామానికి చెందిన కూర్మదాసు శ్రీనివాస్ నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారిని ఎంపీ పరామర్శించారు. కాపారపు నాగబాబు కుడి కాలు తొలగించినట్లు వైద్యులు ఎంపీకి తెలిపారు. మరో క్షతగాత్రుడు కూర్మదాసు శ్రీనివాస్ కాలికి సోమవారం చికిత్స చేయనున్నట్లు తెలిపారు. వారికి. మెరుగైన వైద్యం అందజేయాల్సిందిగా వైద్యులను ఎంపీ భరత్ కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ భరత్ ధైర్యం చెప్పారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఎమ్మెల్యే రాజా అండ

ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు సహకరిస్తానని భరోసా



ఎమ్మెల్యే రాజాకు తన సమస్యను వివరిస్తున్న శివ

రాజమహేంద్రవరం సిటీ: మూడు పదుల వయసులోనే కిడ్నీ వ్యాధికి గురై ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమైన ఓ యువకుడి దయనీయ పరిస్థితిపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్పందించారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిపించి ప్రాణాలు నిలబెట్టడానికి సహకారం అందించడానికి భరోసా ఇచ్చారు. తన వ్యక్తిగత సహాయకుని పిలిచి విజయవాడలోని కార్పొరేట్ ఆసుపత్రులను సంప్రదించి శస్త్రచికిత్సకు అవసరమైన ఏర్పాట్లుచేసి దగ్గరుండి పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించారు. రాజమహేంద్రవరం నగరంలో తుమ్మలావ ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల యువకుడు గోపి శివ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని వైద్యులు సూచించారు. పేద కుటుంబానికి చెందిన శివకు ఆయన మాతృమూర్తి వరలక్ష్మి కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చారు. అయితే ఈ శస్త్ర చికిత్స ఎలా చేయించుకోవాలి? ఎక్కడ చేయించుకోవాలి తదితర అంశాలపై అవగాహన లేకపోవడం, సామాన్య కుటుంబం కావడంతో పరిచయస్తుల సలహాతో ఆదివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో కలసి పరిస్థితి వివరించారు. శివ సమస్యను విన్న ఎమ్మెల్యే రాజా తక్షణమే తన వ్యక్తిగత సహాయకుని పిలిచి శివకు శస్త్రచికిత్స అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, శస్త్ర చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు.

8న ఉచిత క్యాన్సర్ పరీక్షలు



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా వైద్యులు

కంబాలచెరువు: ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐఎంఏ మహిళా విభాగం, రాజమండ్రి ఆబ్ స్టెట్రిక్ అండ్ గైనికాలజీ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని గైనిక్ ఆసుపత్రుల్లో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ విభాగానికి చెందిన డాక్టర్ కస్తూరి విజయలక్ష్మి, డాక్టర్ అనసూరి పద్మలత తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో మహిళా వైద్యులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంబాలచెరువు మెయిన్ గేటు నుంచి పుష్కర్ ఘాట్ వరకూ ర్యాలీ జరిగింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఆర్‌వోజీఎస్‌వై ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టల్స్ బాలికలకు పోషకాహారం, నెలసరి సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత గురించి అవగాహన కల్పించనున్నామన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి, శానిటరీ పాడ్స్ పంపిణీ చేస్తామన్నారు. మార్చి 8వ తేదీన అన్ని గైనిక్ హాస్పిటల్స్ లో ఉచిత కాన్సర్ నిర్ధారణ పరీక్షలు, బ్రెస్ట్ స్కానింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనసూరి ప్రియాంక, డాక్టర్ చంద్రిక, డాక్టర్ దేవిశ్రీ మురారి, డాక్టర్ పద్మజ, డాక్టర్ దివ్య, డాక్టర్ చిట్టిసుధ, డాక్టర్ వై.సునీత, డాక్టర్ డి.లక్ష్మి, డాక్టర్ స్పందన, డాక్టర్ కె.హారిక, డాక్టర్ పి.రేణుక, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు.

త్వరలో డ్రైన్ నిర్మాణం

వైఎస్సార్ సీపీ రూరల్ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్



డ్రైన్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రకొండపై ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ వద్ద ఉన్న డ్రైన్, ప్రహరీ సమస్యను స్థానిక నాయకులు చందన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో డ్రైన్‌ను చందన నాగేశ్వర్ పరిశీలించారు. ఇప్పటికే డ్రైన్ నిర్మాణానికి ప్రపోజల్స్ పంపామని త్వరలోనే డ్రైన్ నిర్మాణం ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతామని చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. అనంతరం సచివాలయం-2 భవన నిర్మాణానికి సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి చందన నాగేశ్వర్ పరిశీలించారు. ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద చేపల మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న మత్స్యకార మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఉన్నారు.

నేడు కోరుకొండలో పారిజాత గిరి ప్రదక్షిణ

రాజానగరం: కోరుకొండపై కొలువైవున్న లక్ష్మీనరసింహస్వామి పారిజాత గిరి ప్రదక్షిణ సోమవారం జరుగనుంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని దేశ సంచార యాత్రికునిగా పేరొందిన దివాన్‌చెరువుకు చెందిన పెన్నాడ మోహన సారథ్యంలో కొంత మంది భక్తులు గ్రామంలోని లక్ష్మీగణపతిని దర్శించుకుని సాయంత్రం 5 గంటలకు దివాన్‌చెరువు నుంచి బైకులపై కోరుకొండకు చేరుకుంటారు. సుమారు మూడు కిలోమీటర్లు ఉన్న పారిజాత గిరి చుట్టు ప్రదక్షిణ చేసి, కొండ మెట్లు ఎక్కి స్వామిని దర్శించుకుని తిరిగి దివాన్‌చెరువుకు చేరుకుంటారు. మాఘ పౌర్ణమి సందర్భంగా చేపడుతున్న ఈ ప్రదక్షిణలో ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనవచ్చని మోహన్ తెలిపారు.

ఘనంగా ఉత్తర పౌర్ణిమ మహోత్సవాలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

ప్రకాశం నగర్ : స్థానిక బర్మాకాలనీలో వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉత్తర పౌర్ణమి మహోత్సవంలో భాగంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ ఆలయంలో ఫాల్గుణ ఉత్తర పూర్ణిమ మహోత్సవాలను పది రోజులు పాటు నిర్వహిస్తారన్నారు. 44 సంవత్సరాలుగా ఈ ఆలయంలో ఫాల్గుణ ఉత్తర పౌర్ణమి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభినందించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యాళ్ల సురేష్, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, సెక్రటరీ సీహెచ్ మురళీకృష్ణ, ట్రెజరర్ పి.నరసింహారావు పాల్గొన్నారు.

మహిళా శిల్పులను గుర్తించాలి



దేవికారాణిని సన్మానిస్తున్న సభ్యులు

ప్రకాశం నగర్ : మహిళా శిల్పుల సేవలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గుర్తించాలని మహిళా శిల్పి దేవికారాణి వడయార్ విజ్ఞప్తి చేశారు. వివిధ రంగాలకూ చేయూత ఇస్తున్న ప్రభుత్వాలు, ఇతర సంఘాలూ మహిళా శిల్పులను కూడా ఆదరించాలని కోరారు. రాబోయే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సీపీ బ్రౌన్ మందిరం ఆధ్వర్యంలో దేవికారాణి వడయార్‌కి సన్మానం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దాదాపు ఏడు వేల శిల్పాలను తాను ఇంతవరకూ చెక్కానని తెలిపారు. బ్రౌన్ విగ్రహాన్ని తాను చెక్కి బహుమానంగా అందజేస్తానని ప్రకటించారు. సన్నిధానం శాస్త్రి , కోసూరి చండీప్రియ, బొల్లాప్రగడ ఉదయభాను, బేతా శారదా దేవి, సౌందర్య పాల్గొన్నారు.

మాంస దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా విజిలెన్స్ ఎస్పీ పీవీ.రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి చికెన్, మటన్, చేపల షాపులలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరకు, తూనిక, కొలతల్లో వ్యాపారులు వినియోగ దారులను మోసం చేస్తున్నట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో వినియోగదారులు ఫిర్యాదు చేయాలన్నారు. తూకం తేడా, ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం వంటివి గుర్తించి జిల్లాలోని అనపర్తి మండలంలో నాలుగు, కడియం మండలంలో నాలుగు కేసులు నమోదు చేశారు.

వైభవంగా చండీహోమం

సీటీఆర్ఐ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల శ్రీపాత సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మూడో రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు అమ్మవారికి విశేష పూజలు, 9 గంటలకు చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమా నృత్యానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- వైఎస్సార్ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్
- బూరుగుపూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహణ



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

మధురపూడి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వైఎస్సార్ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్ అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని గ్రౌండ్‌లో బూరుగుపూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలను నిర్వహించడం మంచి కార్యక్రమమన్నారు. తొలుత రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. జక్కంపూడి రామ్మోహనరావు చారిటబుల్ ట్రస్టు పేరిట అనేక క్రీడా పోటీలను నిర్వహించిన సంగతిని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో బూరుగుపూడి క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న యువతను ఆయన అభినందించారు. కోరుకొండ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 32 టీమ్‌లు తలపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ నెల 11వతేదీన బహుమతుల ప్రదానోత్సవం జరుగుతున్నట్టు, మొదటి బహుమతిగా రూ.2,5000, ద్వితీయ బహుమతిగా రూ. 15,000తో పాటు ట్రోఫీ బహుమతి కూడా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి బంతులను ఆయన బౌండరీ వైపునకు కొట్టి అందర్నీ అబ్బుర పర్చారు. ఈ సందర్భంగా నాయకులు జక్కంపూడి గణేష్ బాబును శాలువా, పూలమాలలతో సత్కరించారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే పోటీలతో క్రీడా సందడి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు క్రొవ్విడి సర్రాజు, కంటే వినయ్ తేజ, పిట్టా కృష్ణ, చీంద్రిం శ్రీహరి, టోర్నమెంట్ నిర్వాహకులు ఏడిద పండు, పిల్లి క్రాంతి పాల్గొన్నారు. అనంతరం రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన వెంకటనగరం టీమ్ రాయుడుపాకలు టీమ్‌తో తలపడి విజయాన్ని కైవసం చేసుకుంది. రాజానగరం మండలానికి చెందిన సీతారాంపురం టీమ్ బూరుగుపూడి టీమ్‌తో తలపడి గెలుపొందింది.

సినిమాలు



శ్యామల	: బలగం
సూర్యమినీ	: అమిగోస్
సూర్యప్యాలెస్	: ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు
స్వామి	: వాల్తేరువీరయ్య
అశోక	: సార్
అనుశ్రీ	: గ్యాంగ్‌లీడర్
రాజా	: సార్
ఊర్వశి	: గ్రంథాలయం, సాచి
రంభ	: రిచిగాడిపెళ్లి, ఇవేకాక
మేనక	: వీరసింహారెడ్డి
గీతాఅప్సర	: వినరోభాగ్యమువిష్ణుకథ
నామవరం	
వి.ఎస్.మహల్	: సార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సార్